సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి

జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో నగరంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం విచ్చేసిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వి. విజయసాయిరెడ్డి, అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్ కె.సతీష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు కొండా రాజీవ్ గాంధీ, ఆల్ఫా కృష్ణ తదితరులు కలిశారు.

న్యూస్‌రీల్

గోదావరిలో బోటింగ్‌పై నేడు మాక్ డ్రిల్

రంపచోడవరం: కలెక్టర్ ఆదేశాల మేరకు గండి పోశమ్మ పాపికొండలు టూరిజం పాయింట్ వద్ద శుక్రవారం గోదావరిలో బోటింగ్‌పై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. గోదావరి నదిలో బోటింగ్ వేళ ఏ విధమైన భద్రత చర్యలు పాటించాలి.. హఠాత్తుగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారిని ఎలా రక్షించాలి వంటి విషయాలపై రాష్ట్ర విపత్తు, సహాయక దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) అవగాహన కల్పించేల మాక్‌డ్రిల్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బోట్ ఓనర్లు, రెవెన్యూ, పోలీసు, అటవీ, అగ్నిమాపక, ఇరిగేషన్, మత్స్యశాఖ, వైద్యశాఖల అధికారులు హాజరవుతారని ఆమె తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా పద్మలత

సాక్షి,పాడేరు: జిల్లా రెవెన్యూ అధికారిగా కె.పద్మలతను నియమిస్తూ ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. విశాఖపట్నంలోని సివిల్ డిఫెన్స్ ఎస్‌డీసీగా పనిచేస్తున్న పద్మలతను అల్లూరి సీతారామరాజు జిల్లా డీఆర్‌వోగా బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌వో బి.పద్మావతిని జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

జ్వరాలపై ఇంటింటా సర్వే

- చేపట్టిన చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు



చవిటిదిబ్బలు గ్రామానికి వచ్చిన పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వై.రామవరం: మండలంలో జ్వరపీడితుల వివరాల సేకరణకు ఇంటింటా సర్వే చేపడుతున్నట్టు చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ దినేష్, నరేంద్ర తెలిపారు. విజృంభిస్తున్న విషజ్వరాలు శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. దీనిలో భాగంగా పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి గురువారం ఇంటింటా సర్వే ప్రారంభించారు. మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి, ఎంఎల్‌పీహెచ్‌ఈవోలు, సచివాలయాల ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి షాపుల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: దీపావళి సామాన్లు విక్రయించనున్న వ్యాపారులు తప్పని సరిగా అనుమతులు పొందాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్,ఫైర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో తహసీల్దార్ ద్వారా నిబంధనల ప్రకారం లైసెన్సులు పొందిన వారు మాత్రమే దీపావళి సామాన్లు అమ్ముకునే అవకాశం ఉందన్నారు. అనుమతులు పొందకుండా విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి శివారు ప్రాంతానికి ఖాళీస్థలంలో మందుగుండు సామాన్లు దుకాణాలు ఏర్పాటుచేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎల్పీవో రఘునందన్, తహసీల్దార్లు సూర్యారావు, కె. సత్యనారాయణ, ఏపీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్రాపల్లికి ఏం చేశారు?



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ తనూజరాణి



వేదికపై అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్, హోంమంత్రి అనిత, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు

- సత్వర న్యాయానికి నోచుకోని బాధితులు
- గిరిజనుల ప్రాణాలంటే చిన్నచూపు
- ఉమ్మడి విశాఖ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అరకు ఎంపీ తనూజరాణి ఆవేదన
- చర్యలు తీసుకుంటున్నామని బదులిచ్చిన అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు జారిపడిన జీకే వీధి మండల చట్రాయపల్లి గ్రామంలో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల సత్వర న్యాయం జరగలేదని అరకు ఎంపీ గుమ్మా తనూజ రాణి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సీఈవో పి. నారాయణమూర్తి అజెండా అంశాలను చదివి వినిపించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాల గురించి సంబంధిత అధికారులు వివరించారు. సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. దీనిలో భాగంగా అరకు ఎంపీ మాట్లాడారు. మైదాన ప్రాంతంలో వివిధ కర్మాగారాల్లో సంభవించిన ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తే ఆయా కుటుంబాలకు రూ.కోట్లలో ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం మన్యంలో ఆదివాసీ గిరిజన ప్రజల ప్రాణాలంటే ఎందుకు లెక్క లేదని ప్రశ్నించారు. ప్రాథమికోన్నత పాఠశాలలను జెడ్పీ ఉన్నత పాఠశాలలుగా స్థాయి పెంచి అక్కడ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో నీటిఎద్దడి సమస్య పరిష్కరించాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో శిథిల స్థితిలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. మండల పరిషత్, జెడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది జెడ్పీ పీఎఫ్ ఖాతాలను అప్డేట్ చేయాలని కోరారు. దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లు లేకపోవడంతోనే గిరిజన ప్రాంతాల్లో అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. కొన్ని మండల పరిషత్ కార్యాలయాల స్థలాలు అక్రమణ గురవుతున్నాయన్నారు. కాఫీ, మిరియాలు, జీడితోటలు, ఇతర పండ్ల తోటలకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసేలా పార్లమెంటులో ప్రస్తావించాలని జెడ్పీ చైర్‌పర్సన్, సభ్యులు ఆమెను కోరారు. ఈ అంశాలను తప్పకుండా ప్రస్తావిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

మోడల్ కాలనీ నిర్మిస్తాం: అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



ఇటీవల కురిసిన వర్షాలకు జీకే వీధి మండలంలోని చట్రాపల్లిలో భారీ నష్టం జరిగిందని, అక్కడి ప్రజలు ఇళ్లు కూడా కోల్పోయారని స్థానిక జెడ్పీటీసీ ప్రస్తావించారు. దీనిపై ఆ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించానని, అక్కడి పరిస్థితులను పరిశీలించానని చెప్పారు. చట్రాపల్లి గ్రామంలోని 37 కుటుంబాలను అనుకూలమైన ప్రాంతానికి తరలించి వారికి కోసం పీఎం ఆవాస్ యోజన పథకం కింద మోడల్ కాలనీని నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలకు ఇసుక ఉచితం

ఇకపై గృహ నిర్మాణాలకు, ఇతర కట్టడాలకు ఇసుక ఉచితంగానే తమ ప్రభుత్వం ఇస్తుందని.. కాకపోతే స్థానిక అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి ఇసుక తెచ్చుకోవచ్చని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. ఏజెన్సీలో డోలీ మోతలు ఉండవు.. రోడ్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రతి గ్రామంలో రోడ్లు వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు రూ.20 కోట్లతో రోడ్లమరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు వల్ల ఎన్నో దుష్ప్రయోజనాలు కలుగుతున్నాయని పేర్కొంటూ ఆ పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహిస్తామని హోం మంత్రి పేర్కొన్నారు. ఏజెన్సీలో 9,500 హెక్టార్లకు గాను 4,500 క్వింటాళ్ల రాజ్ మా విత్తనాలు సరఫరా చేసినట్లు సభ్యుల ప్రశ్నకు వ్యవసాయశాఖ అధికారులు బదులిచ్చారు.

ఈవోపీఆర్‌డీల బదిలీల మాటేంటి? వివరణ కోరిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఏజెన్సీలో పనిచేసిన ఈవోపీఆర్‌డీలకు మైదాన ప్రాంతాలకు నియమ నిబంధనల ప్రకారం బదిలీలు జరగలేదన్న ఆరోపణలున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో నియమ నిబంధనల ప్రకారం ఈవోపీఆర్‌డీ బదిలీలు ఎందుకు చేయలేదు..కొన్ని చోట్ల ఇంకా ఈఓపీఆర్‌డీలను ఎందుకు నియమించలేదు..? అని అనకాపల్లి, అల్లూరి డీపీవోలను జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర వివరణ కోరారు. దీనిపై సమాధానంగా అనకాపల్లి డీపీవో శిరీషారాణి మాట్లాడుతూ..అనకాపల్లిలో జిల్లాలో నక్కపల్లి, పరవాడ, దేవరాపల్లిలో మాత్రమే ఖాళీ ఉందన్నారు. నక్కపల్లి, పరవాడలో నిబంధనల ప్రకారమే నియమించడం జరిగిందన్నారు. దేవరాపల్లిలో ఇంకా నియమించలేదన్నారు, ప్రస్తుతం చీడికాడలో పనిచేసే ఈఓఆర్‌డీని ఇన్‌చార్జిగా వేస్తామని డీపీవో బదులిచ్చారు.

డోలీ మోత నుంచి విముక్తి కల్పించండి



విశాఖ జెడ్పీ కార్యాలయం వద్ద డోలీలతో గిరిజన మహిళల ప్రదర్శన

మహారాణిపేట (విశాఖ): తరాలు మారినా తలరాతలు మారలేదని ఆవేదన చెందారు.. తమకు ఎన్నాళ్లీ కష్టాలని నిలదీశారు.. డోలీ మోతల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గిరిజన మహిళలు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. గురువారం విశాఖలో జిల్లా పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగిన సందర్భంగా తమ కష్టాలు అందరికీ తెలిసేలా ప్రదర్శన జరిపారు. రోగులను, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు తాము కొండ కోనల్లో ఎంత కష్టపడుతున్నామో అర్థమయ్యేలా డోలీ కట్టి మరీ చూపించారు. ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలో జాజులబంద, నీలబంద, దాయర్తి గిరిజన గ్రామాలకు, కొయ్యూరు మండలం మూలపేట, రోలుగుంట మండలం పిత్రగడ్డ, నీలబంద, పెదబుగోరు గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయాలని కోరారు. ఈ రెండు జిల్లాల కలెక్టర్లు స్వయంగా పై గ్రామాలను పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.వెంకటరావు, కె.చిన్నారావు, రాజారావు పాల్గొన్నారు.

చుట్టపుచూపుగా 'అధికార' ప్రజాప్రతినిధులు

ప్రజా సమస్యలు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కూటమి ప్రజాప్రతినిధులు చుట్టపు చూపులా వచ్చి వెళుతున్నారు. తొలి సమావేశానికి కనీసం మంత్రులు కూడా రాలేదు. ఇది రెండో సర్వసభ్యసమావేశం కాగా..ప్రజాప్రతినిధులు రాలేదు. తొలుత పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఇద్దరూ వచ్చి గంట పాటు ఉండి వెళ్లిపోయారు. హోంమంత్రి వంగలపూడి అనిత అరగంట పాటు ఉండి ఆమె కూడా వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ వచ్చి కాసేపు తరువాత వెళ్లిపోయారు. ఇక మిగతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవ్వరూ రాలేదు. వచ్చిన అధికార ప్రతినిధులు కూడా కేవలం ఫోటోలు ఫోజులివ్వడానికే పరిమితమయ్యారన్న విమర్శలు వినిపించాయి.



అధికార పార్టీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడంతో ఖాళీగా కుర్చీలు

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అక్రమాల గుట్టురట్టు

- 34 బస్తాల బియ్యం, పది కిలోల చింతపండు స్టోర్‌రూం నుంచి తరలింపు
- పక్కదారి పట్టించేందుకు యత్నం
- గుర్తించిన ఎంపీపీ గోము వెంకటలక్ష్మి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- వెంటనే స్పందించిన టీడబ్ల్యూ డీడీ విజయశాంతి
- విద్యార్థినుల నుంచి వివరాల సేకరణ
- చర్యలపై ఉన్నతాధికారులకు నివేదిక
- రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో ఘటన



విద్యార్థినుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీడీ విజయశాంతి



అధ్యాపకుని క్వార్టర్‌లో నిల్వ చేసిన బియ్యాన్ని పరిశీలిస్తున్న డీడీ విజయశాంతి

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థినుల ఆహారానికి వినియోగించాల్సిన బియ్యం, చింతపండును స్టోర్ రూం నుంచి పక్కదోవ పట్టించేందుకు సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి గురువారం కళాశాలకు వెళ్లి ఆరా తీయడంతో ప్రిన్సిపాల్ అక్రమాలు వెలుగు చూశాయి. వెంటనే ఆమె ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి హుటాహుటిన కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. కళాశాలలో పనిచేసే ఓ అధ్యాపకుని క్వార్టర్‌లో నిల్వచేసిన 34 బస్తాల (1700 కిలోలు) బియ్యం, పది కిలోల చింతపండును ఆమె గుర్తించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది, ప్రిన్సిపాల్ సలోమిని విచారించారు. బియ్యాన్ని తానే వేరే గదిలో నిల్వచేశానని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని ప్రిన్సిపాల్ చెప్పారని డీడీ విలేకరులకు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం, చింతపండును అడ్డతీగల మండల లెవెల్ స్టాక్ పాయింట్‌కు తరలించామని ఆమె వివరించారు. దీనిపై ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు నివేదిస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సలోమీకి షోకాజ్ నోటీసు జారీ చేస్తామన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీడీ స్పష్టం చేశారు.

పిల్లలతో మోయించారు

కళాశాలలోంచి 34 బస్తాల బియ్యాన్ని స్టోర్ రూమ్ నుంచి అధ్యాపకుని క్వార్టర్‌కు 8 మంది విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మోయించినట్టు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి విచారణలో వెలుగుచూసింది. బియ్యం నిల్వ చేసిన విషయం వెలుగు చూడటంతో వెంటనే వాటిని తమతో సమీప అటవీ ప్రాంతంలోకి తరలించేందుకు ప్రిన్సిపాల్ ప్రయత్నించారని విద్యార్థినులు డీడీకి వివరించారు. బియ్యం పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. డీడీ వెంట ఆర్‌ఐ చెలమ్మ, ఎంఈవోలు సత్యనారాయణదొర, సూరయ్య రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : నియోజకవర్గంలో ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండలంలో పర్యటించారు. మండలంలోని వేమనపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త చిన్నారుల దొర కుమారుడు కారం త్రిమూర్తుల దొర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, పార్టీ మండల ఇన్‌చార్జి సీహెచ్ రఘునాథ్, మండల కన్వీనర్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సూరంపూడి ఏడుకొండలు, మొల్లేరు సొసైటీ మాజీ డైరెక్టర్ పిర్ల నాగేశ్వరరావు, కొత్తాడ, సూరంపాలెం సర్పంచ్ ఎస్. కామరాజు, బల్లెం శివ, పార్టీ నేతలు బాబ్జి, చంద్రరావు, దొంగబాబు, సారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వేమనాపల్లిలో కారం త్రిమూర్తులు దొర తండ్రి చిన్నాలదొరను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, పార్టీ నాయకులు

గడువులోగా మ్యుటేషన్ ప్రక్రియ IIలో

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి

- చింతూరు, రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా
- వై.రామవరం పోలీసుస్టేషన్ సందర్శన



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా

వై.రామవరం: ప్రతి ఒక్కరు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని చింతూరు, రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన వై.రామవరం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఏవోబీలో మావోయిస్టుల కదలికలపై ఆరా తీశారు. విద్యుత్ ఉచ్చులతో వన్యప్రాణులను వేటాడే వారితోపాటు గంజాయి, డ్రగ్స్ వ్యాపారులు, వారికి సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ నర్సింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణను ఆదేశించారు. అసాంఘిక శక్తులకు సహకరించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. స్టేషన్‌లో భద్రత ఏర్పాట్లు, సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న ఏపీఎస్పీ 3వ బెటాలియన్ అదనపు బలగాల పోలీసుల భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సిబ్బంది పలు సూచనలు చేశారు.

విశాఖ-కిరండూల్ రైలుకు నేడు విస్టాడోమ్ కోచ్ జత

తాటిచెట్లపాలెం: అరకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు శుక్రవారం ఒక్కరోజు అదనంగా విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26న కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ అదనపు విస్టాడోమ్ కోచ్‌తో ప్రయాణిస్తుంది.

ఏజెన్సీలో రబ్బరు సాగుకు ప్రోత్సాహం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



పీఎం కోటలో రబ్బరు షీట్‌ల తయారీని పరిశీలిస్తున్న పీవో సింహాచలం

రంపచోడవరం/మారేడుమిల్లి: ఏజెన్సీలో రబ్బరు రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మారేడుమిల్లి మండలంలోని పందిరిమామిడి కోట, తదితర గ్రామాల్లో రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లను పీవో గురువారం పరిశీలించారు. రబ్బరు రైతుల నుంచి పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారేడుమిల్లి, వై రామవరం అప్పర్ పార్ట్ రబ్బరు సాగుకు అనుకూలంగా ఉందన్నారు. రబ్బరు సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చిన రైతులకు ఐటీడీఏ ద్వారా రబ్బరు మొక్కలను అందజేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రబ్బరు మొక్కల సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తామన్నారు. ఉపాధి హామీలో రబ్బరు మొక్కలు సంరక్షణ చేసుకున్న వారికి ఉపాధి వేతనం చెల్లిస్తామని తెలిపారు. రబ్బరు సాగుపై గిరిజనులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. రబ్బరు పాలు సేకరణ తరువాత, రబ్బరు షీట్ల తయారీని పీవో పరిశీలించారు.



రైతులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

తిరుమల దూరాభారం



తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే యత్నం

- రైల్వే బోర్డుకి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఒంగోలు రూట్‌లో కాకుండా గుంటూరు, నంద్యాల మీదుగా వెళ్లేలా మార్పులు
- ఇదే జరిగితే 5 గంటలు ఆలస్యంగా తిరుపతి చేరుకోనున్న ప్రయాణికులు
- వాల్తేరు డివిజన్ అభిప్రాయం తీసుకోకుండానే కుట్రకు తెర

తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలంటే కోస్తాంధ్ర జిల్లాల భక్తులందరికీ గుర్తొచ్చే ఒకే ఒక్క రైలు తిరుమల ఎక్స్‌ప్రెస్. ఈ రైలు ఎక్కితే.. స్వామి దర్శనానికి సరైన సమయంలో చేరుకోవచ్చు. అందుకే ఈ రైలుకు అంత డిమాండ్. కానీ.. ఇప్పుడా పరిస్థితులు కనిపించవేమో.? ఎందుకంటే తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే యత్నిస్తోంది. కొత్త రూట్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపింది. వాల్తేరు డివిజన్ అభిప్రాయం తీసుకోకుండానే కుట్రకు తెర తీసినట్లు తెలుస్తోంది. – సాక్షి, విశాఖపట్నం

తిరుమల ఎక్స్‌ప్రెస్ ఒక రైలు కాదు.. ఆధ్యాత్మిక కేంద్రం. శ్రీకాకుళం నుంచి ఒంగోలు వరకు తిరుపతి వెళ్లే ప్రయాణికులు కచ్చితంగా ఎంపిక చేసుకునే మొదటి ఆప్షన్ ఈ రైలే. వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే వేళలకు అనువుగా తిరుపతి చేర్చే రైలు దాదాపు ఇదే ఉంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్ భక్తులకు సెంటిమెంట్‌గా మారిపోయింది. ఈ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తేనే తిరుపతి వెళ్లి.. ఏడుకొండల వాడి దర్శనం సజావుగా సాగుతుందనే నమ్మకం చాలా మందిలో ఉంది. అందుకే ఈ రైలు ప్రతి రోజూ 100కి పైగా ఆక్యుపెన్సీతో పరుగులు పెడుతుంటుంది. వెయింటింగ్ లిస్ట్ చాంతాడంత పెరిగిపోయినా.. రిజర్వేషన్ కన్ఫర్మ్ అవుతుందనే ఏదో ఒక నమ్మకంతో ఈ రైలుకే రిజర్వేషన్ చేస్తుంటారు. ఒక వేళ సీటు దొరక్కపోయినా నిలబడైనా వెళ్లేందుకు సిద్ధమైపోతుంటారు.

దర్శన వేళలకు అనువైన రైలు

తిరుమల దర్శనానికి అన్ని ప్రాంతాల వారికీ అనువైన రైలు ఇదే. 17488 నంబర్‌తో నడిచే ఈ సర్వీస్ విశాఖలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరుతుంది. తిరుపతి రైల్వేస్టేషన్‌కు తర్వాత రోజు వేకువజామున 4.30కి చేరుకుంటుంది. అక్కడ దిగే భక్తులు అలిపిరి మార్గంలోనైనా, శ్రీవారి మెట్ల



మార్గంలోనైనా వెళ్లేందుకు సరైన సమయం ఇది. అంటే తిరుపతిలో దిగి స్నానమాచరించి శ్రీవారి మెట్ల మార్గానికి ఉదయం 6 గంటలకు చేరుకుంటే ఉదయం 10 లేదా 11 గంటల దర్శనానికి టోకెన్ లభిస్తుంది. ఆ టోకెన్‌తో స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత తిరుగు ప్రయాణం కూడా సులువవుతుంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్‌నే అందరూ నమ్ముకుంటారు.

అదనంగా నాలుగైదు గంటలు వృథా

వాస్తవానికి ఈ రైలు ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ.. నడిచే రూట్ మొత్తం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ఉంది. విశాఖలో బయలుదేరి దువ్వాడ వరకు మాత్రమే ఈస్ట్‌కోస్ట్ పరిధిలోకి వస్తుంది. మిగిలినదంతా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉంది. అంతే కాకుండా ట్రిప్ టెర్మినేటింగ్ కూడా ఆ జోనే చూస్తోంది. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్ రూట్ మార్చే ప్రతిపాదనలు చేసేందుకు ఆ జోన్‌కు అన్ని అర్హతలున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకుని కొన్ని రూట్లకు రైలు అవసరమని.. అందుకే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆ వైపుగా దారి మళ్లించేందుకు అంగీకరించాలంటూ రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించింది. విజయవాడ నుంచి ఒంగోలు మీదుగా కాకుండా.. విజయవాడ నుంచి గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతి వెళ్లేలా రూట్ మార్పులకు అనుమతి కోరింది. దీనికి బోర్డు ఓకే చెబితే.. మన ప్రయాణం మరింత భారంగా మారుతుంది. ప్రస్తుతం విశాఖపట్నంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ రైలు ఎక్కితే 14.30 గంటల పాటు తిరుపతికి ప్రయాణం సాగుతుంది. కొత్త రూట్ అయితే మరో 5 గంటలు అదనపు సమయం పడుతుంది. అంటే విశాఖపట్నంలో మధ్యాహ్నం రెండు గంటలకు రైలు ఎక్కితే.. తర్వాత రోజు ఉదయం 9 లేదా 10 గంటలకు తిరుపతి చేరుకుంటారు. దీని వల్ల దర్శన వేళలకు అందే అవకాశం ఉండదు. ఈ రూట్ మార్చితే ఉత్తరాంధ్రతో పాటు విజయవాడ వరకూ ఉన్న భక్తులు తిరుమల వెళ్లేందుకు అవస్థలు తప్పవు. దక్షిణ మధ్య రైల్వే దుర్బుద్ధిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూటు మారితే చేటే!

1970లో ప్రారంభమైన తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీస్ కొన్నేళ్ల కిందట కడప వరకూ పొడిగించారు. అయినప్పటికీ కోస్తాంధ్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. కారణం తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత కడప వెళ్లేది. ఇప్పుడు మరోసారి రూట్ మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే కుయుక్తులు పన్నుతోంది. ప్రస్తుతం ఈ రైలు విజయవాడ నుంచి ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట జంక్షన్ మీదుగా తిరుపతి చేరుకుని అక్కడి నుంచి కోడూరు, రాజంపేట మీదుగా కడప వెళ్తుంది. అయితే ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలోని తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసు రూటు మార్చాలని దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు భావిస్తున్నారు. కారణాలు ఏమీ చెప్పకుండానే రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలు ఒప్పుకుంటే ఇకపై విజయవాడ నుంచి ఒంగోలు వైపుగా వెళ్లకుండా.. గుంటూరు మీదుగా నడుస్తుంది. ఇదే జరిగితే భక్తులు తిరుపతి వెళ్లే సమయం పూర్తిగా మారిపోతుంది. వేకువ స్వామి దర్శనానికి అందే పరిస్థితి ఉండదు.

ఇదేం రూట్ మార్పు?



తిరుమల ఎక్స్‌ప్రెస్ అంటే మాకో నమ్మకం. ఎప్పుడు తిరుపతి వెళ్లాలన్నా.. ఈ రైలునే ఎంచుకుంటాం. ఎందుకంటే వేకువ జామునే తిరుపతి చేరుకుంటుంది. అక్కడ నుంచి మెట్లమార్గంలోనైనా.. కాలినడకనైనా.. ఏ దర్శనానికైనా నిర్ణీత సమయానికి తిరుమలకు చేరుకుంటాం. దర్శనానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ప్రయాణం సాగిపోతుంది. అలాంటి రైలు రూట్‌ను మార్చడం సరికాదు. రైల్వే అధికారులు దీనిపై పునరాలోచించాలి. – ఎం.ఉషారాణి, సీతమ్మధార

ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలి



తిరుపతి వెళ్లే ప్రతి భక్తుడూ దశాబ్దాలుగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను నమ్ముకుంటున్నారు. అలాంటి ఈ రైలును వేరే మార్గంలో తిప్పాలని ఎలా ప్రతిపాదిస్తారు? జోన్ అధికారులకు భక్తుల మనోభావాలతో సంబంధం లేదా? కొత్త రూట్‌లో తిప్పితే కోస్తాంధ్ర జిల్లాల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు రైల్వే బోర్డుపై ఒత్తిడి తేవాలి. సౌత్ సెంట్రల్ జోన్ పంపిన ప్రతిపాదనలు తిప్పికొట్టేలా పోరాడాలి. – కె.రామసుధ, ప్రయాణికురాలు

క్లుప్తంగా

డ్రైనేజీలో పడి వృద్ధునికి తీవ్ర గాయాలు



గాయపడిన రాజులు

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో ఓ వృద్ధుడు డ్రెయినేజీలో పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వట్టిగెడ్డ గ్రామానికి చెందిన గవిరెడ్డి రాజులు (65) రోడ్ పక్కగా నడుస్తు నిర్మాణదశలో ఉన్న లోతైన డ్రైనేజీలో పడిపోయాడు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా డ్రెయినేజీ నిర్మాణం పూర్తయిన తరువాత కొంతమేర పైకప్పు వేయకపోవడంతో ఈ విధంగా జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదంలో రాజులుకు మెడ వెనుక వైపు నుంచి తల భాగం వరకు ఇనుప ఊచ గుచ్చుకొని పోయింది. అదే విధంగా తల భాగం బాగా గాయమైంది. అతనిని గ్రామస్తులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అంబులెన్స్ సహాయంతో అతని నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రరక్తస్రావంతో ఉన్న అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రామకృష్ణ

పాయకరావుపేట: స్థానిక జాతీయ రహదారిపై నామవరం గ్రామం వద్ద వెనక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ జె.పురుషోత్తం తెలిపారు. నక్కపల్లి నుంచి తుని వైపు బైక్‌పై వెళ్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలానికి చెందిన నక్క రామకృష్ణ(45)ను అదే మార్గంలో అతి వేగంగా వెనక నుంచి ఓ లారీ ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

విజయసాయిరెడ్డిని కలిసిన జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సురేష్‌కుమార్



విజయసాయిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సురేష్‌కుమార్

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నూతనంగా నియమితులైన రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని గురువారం వైఎస్సార్ ట్రస్ట్ చైర్మన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తడబారికి సురేష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించినట్టు సురేష్‌కుమార్ చెప్పారు.

ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) మరో జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఈ నెల 22 నుంచి 23వ తేదీ వరకు ఢిల్లీలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 18వ జాతీయ ఇంధన సదస్సు జరిగింది. ఇంధన రంగంలో వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సంస్థలకు 12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డ్స్ ఫర్ డిస్కమ్స్ పేరిట అవార్డులు ప్రదానం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఏపీఈపీడీసీఎల్‌కు 'కేటగిరీ ఎఫ్–ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్–లార్జ్ డిస్కమ్స్'లో అవార్డు లభించింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అనిల్ రాజ్‌దన్ చేతుల మీదుగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డును సొంతం చేసుకుందన్నారు.

బ్లాస్ట్‌ఫర్నేస్–1లో ఉత్పత్తికి చర్యలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్–1(గోదావరి) ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఆరు నెలల తర్వాత ప్రారంభమవుతున్న ఈ బ్లాస్ట్‌ఫర్నేస్ ఉత్పత్తిపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. గతంలో బీఎఫ్–1, బీఎఫ్–2లు ఉత్పత్తి ప్రక్రియలో కొనసాగేవి. స్టీల్‌ప్లాంట్‌కు ఏర్పడ్డ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఐరన్ ఓర్, బొగ్గు కొరత ఏర్పడ్డాయి. దాంతో ఆరు నెలల క్రితం బీఎఫ్–1ను తాత్కాలికంగా నిలిపి వేశారు. అప్పటి నుంచి బ్లాస్ట్‌ఫర్నేస్–2లో మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది. దీంతో ప్లాంట్ కేవలం మూడో వంతు ఉత్పత్తి మాత్రమే చేయగలుగుతోంది. నెల రోజులుగా కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమీక్షల ఫలితంగా ప్లాంట్‌కు రూ.1,650 కోట్ల ప్యాకేజీ లభించింది. దాంతో ముడి సరకులు కొనుగోలు చేశారు. 27న ఈ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. నిర్ణీత వ్యవధిలో ఫర్నేస్ ప్రారంభించే అవకాశం ఉంది.

గడువులోగా మ్యుటేషన్ ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్



హాజరైన రెవెన్యూ అధికారులు

- అక్రమ వసూళ్లకు పాల్పడితే సస్పెన్షన్
- రేషన్ పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశం

సాక్షి, పాడేరు: గిరిజన ప్రాంతంలో భూముల మ్యుటేషన్ గిరిజనుల హక్కు అని, వారి భూములకు నిర్దిష్టమైన గడువులోగా మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ ఆదేశించారు. గురువారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండలంలో పాడేరు డివిజన్ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి మ్యుటేషన్లకు నోటరీ అఫిడవిట్లు తీసుకోవాల్సి అవసరం లేదన్నారు. నోటరీ అడుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మ్యుటేషన్ చేయడానికి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులు వస్తే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. వీఆర్ఏల రిపోర్ట్ మేరకు నిబంధనల ప్రకారం 30 రోజులలోగా మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ల లాగిన్‌లో 275, వీఆర్ఏల లాగిన్‌లో 84 మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీనిని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. తహసీల్దార్లు రేషన్ పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీఆర్ఏలు సమయానికి అథెంటికేషన్ వేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి ప్రతిపాదను పంపిస్తే భర్తీ చేస్తామని అన్నారు. రేషన్ బియ్యం ఎక్కడైనా పక్కదారి పడితే సంబంధిత సిబ్బందిని ఉద్యోగాల ఉంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లను తనిఖీ చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సర్వే ఫొటోలు సేకరించి తహసీల్దార్ గ్రూప్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికరులపైనే ఉందన్నారు. మీకోసంలో స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సెల్ టవర్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయని, సెల్ టవర్ల వల్ల రేడియేషన్ ఉండదని జియో ప్రతినిధి సత్యా తెలిపారు. సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్వోటీ పద్మావతి, పీఎంయూ ప్రోగ్రాం అధికారి రాంగోపాల్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- డీఈవో బ్రహ్మాజీరావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో బోధన కార్యక్రమాలు చేపట్టాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థుల ప్రత్యేక బోధనకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ జరుగుతోంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన పెంపుదలను ఉపాధ్యాయులంతా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా మండల స్థాయిలో కూడా తోటి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.అన్ని పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, విద్యా ప్రగతి లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంఈవో సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణపతక విజేత లోహిత్‌కు సన్మానం

- జాతీయ పోటీలకు ఎంపికపై అభినందనలు



లోహిత్‌కు నగదు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు తదితరులు

అరకులోయటౌన్: ఇటీవల గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన శెట్టి లోహిత్‌కు అరకులోయ మండలంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నగదు బహుమతిగా వెయ్యి రుపాయలు అందజేసి అభినందించారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న లోహిత్ ఇటీవల జరిగిన జూనియర్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ రన్నింగ్ 200 మీటర్ల పోటీల్లో 2.47 సెకెండ్లు, 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో 51.78 సెకెండ్లల్లో పరుగెత్తి గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక కావడంపై పలువురు లోహిత్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ పట్టాసి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. అధ్యాపకులు అనిత కుమారి, ధర్మారావు, బాలరాజు, డాక్టర్ బలరాం, డాక్టర్ మురళీ, పీడీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు పథకాలపై విస్తృతంగా ప్రచారం

అరకు పోస్టల్ ఐపీవో లక్ష్మీకిషోర్



పోస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న అరకు ఐపీవో లక్ష్మీకిషోర్..

ముంచంగిపుట్టు: పోస్టల్ శాఖలో వివిధ పొదుపు పథకాల ప్రయోజనాలను ప్రతి గడపకు తెలియజేసి, విస్తృతంగా ప్రచారం నిర్వహించి, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ సిబ్బందికి తెలియజేశారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన బీపీఎంలు, ఏబీపీఎంలతో గురువారం పోస్టల్ సేవలపై గిరిజన గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు సబ్ డివిజన్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పోస్టల్ శాఖలో ఉన్న పొదుపు పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే పోస్టాఫీసులను వినియోగించుకొని పోస్టల్ సేవలు పొందేలా పని చేయాలని సూచించారు. పోస్టల్ పొదుపు పథకాలు ఎస్‌బీ, ఆర్‌డి, సుకన్య, ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ, బీమా, ఐపీపీబీ వంటి ఖాతాలు తెరిస్తే పొందే లబ్ధిని తెలియజేయాలన్నారు. పోస్టల్ శాఖలో వచ్చిన డిజిటల్ సేవలను వివరించాలని సూచించారు. ఎంవో శ్రీను, ఎస్‌పీఎం బాపికుమార్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు ,అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమస్యలపై సమగ్రంగా చర్చించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నేతలు

సాక్షి,పాడేరు: మండల కేంద్రంలో గిరిజన సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్, గిరిజన సమాఖ్య నాయకులు కిల్లో సురేంద్ర, వంతాల నాగేశ్వరరావు, కూడా రాధాకృష్ణ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి తొత్తులుగా ఉన్న కొంతమంది వ్యక్తులతో, రహస్య సమావేశాన్ని కలెక్టర్ దినేష్ కుమార్ బుధవారం నిర్వహించడం తగదన్నారు. ఆదివాసీ, ప్రజా, గిరిజన విద్యార్థి సంఘాలను విస్మరించి సమావేశం నిర్వహించడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. గిరిజన తెగల మధ్య వైరుధ్యం సృష్టించడం తగదన్నారు. గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సి ఉందన్నారు. కలెక్టర్ డీఎస్సీ చైర్మన్‌గా ఉండి అన్ని ప్రభుత్వ శాఖల్లో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు నిర్వహించడం లేదని, టూరిజం నుంచి వస్తున్న ఆదాయం ఏమి జరుగుతుందో తెలియడం లేదని చెప్పారు. జీవో నెం 3 పునరుద్ధరణ, గిరిజన విద్యాలయాల్లో విద్యార్థుల మరణాలు, హెల్త్ వలంటీర్ల నియామకాల్లో జాప్యం, డోలిమోతతో గిరిజనుల అవస్థలు, 1/70 యాక్ట్ పరిరక్షణ వంటి అంశాలపై చర్చించాల్సి ఉందన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ పోరాటాలు చేస్తున్న గిరిజన వ్యక్తులకు కలెక్టర్ సమావేశానికి సమాచారం ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా జిల్లా అభివృద్ధికి అన్ని గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహించాలని వారు కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.